
సాక్షి
తూర్పుగోదావరి

ఆదివారం । 31 । మార్చి । 2024



'క్రాఫ్ట్ పేపర్స్'లో అగ్ని ప్రమాదం

మండలంలోని జేగురుపాడు శివార్లలోని శ్రీ మెహర్ గాయత్రీదేవి క్రాఫ్ట్ పేపర్స్ ఎల్‌ఎల్‌పీ పరిశ్రమలో జరిగిన అగ్ని ప్రమాదంలో రూ.7 కోట్లు పైగా ఆస్తి నష్టం వాటిల్లింది. - IIలో ▸



డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం తూర్పు డెల్టాకు 2,472, మధ్య డెల్టాకు 1,607, పశ్చిమ డెల్టాకు 4,300 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ ఆది (సా॥)	సెహరీ సోమ (ఉ॥)
రాజమహేంద్రవరం	6.24	4.36
కాకినాడ	6.24	4.36
అమలాపురం	6.24	4.36

న్యూస్‌రీల్


అవ్వాతాతల పెన్షన్‌ను అడ్డుకోవడమే చంద్రబాబు లక్ష్యం



ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: ఎన్నికల కోడ్ ఉన్నంత వరకూ వలంటీర్ల ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు పంపిణీ చేయించరాదంటూ కేంద్ర ఎన్నికల సంఘం ఆంక్షలు విధించడం వెనుక చంద్రబాబు కుట్రలు, కుతంత్రాలు దాగి ఉన్నాయని స్థానిక ఎంపీ, వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం సిటీ అభ్యర్థి మార్గాని భరత్‌రామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఒకవైపు వలంటీర్లపై తమకు ఎటువంటి కక్షా లేదంటూనే, మరోవైపు ఫిర్యాదులు చేయించి, ఎలాగైనా ఆ వ్యవస్థ లేకుండా చేసేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీలు ప్రజలపై పడి దోచుకునేవన్నారు. ప్రజల నుంచి వచ్చిన అనేక ఫిర్యాదులు, వారి ఆవేదన, ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, నిస్వార్థంగా ప్రజలకు సేవలందించే వలంటీర్ల వ్యవస్థను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకుని వచ్చారని ఎంపీ భరత్ తెలిపారు. గ్రామ/వార్డు వలంటీర్లు ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందించడంతో పాటు, ప్రతి నెలా ఒకటో తేదీన అవ్వాతాతల ఇళ్లకు నేరుగా వెళ్లి పెన్షన్లు అందజేస్తున్నారని గుర్తు చేశారు. అటువంటి వలంటీర్లపై టీడీపీ, జనసేన పార్టీలు తప్ప మరెవ్వరూ ఫిర్యాదు చేయరని అన్నారు. వేసవి ఎండల తీవ్రత నేపథ్యంలో వలంటీర్ల ద్వారా పెన్షన్లు ఇవ్వకుండా ప్రతిపక్షాలు అడ్డుకున్నా, ఏవిధంగా పంపిణీ చేయాలనే అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం యోచించి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తుందని చెప్పారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా పేదల సంక్షేమ పథకాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ప్రతిపక్షాల కుట్రలను ప్రజలు గమనిస్తూనే ఉన్నారని ఎంపీ భరత్‌రామ్ అన్నారు.

జగన్‌వైపే తూర్పు



- గత రెండు సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ హవా
- వైఎస్సార్ సీపీకి భారీగా పెరుగుతున్న ఓట్లు
- ప్రతి నియోజకవర్గంలో 10 నుంచి 15 శాతం పెరుగుదల
- పదేళ్లుగా పడిపోతున్న టీడీపీ ఓటింగ్
- గత ఎన్నికల్లో జనసేన ఓటింగ్ కలిపినా నేలచూపులే..

కొవ్వూరు: ఎన్నిక ఏదైనా తూర్పు గోదావరి జిల్లాలోని మెజారిటీ ప్రజలు దశాబ్ద కాలంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే జై కొడుతున్నారు. గడచిన రెండు సార్వత్రిక ఎన్నికలతో పాటు 'స్థానిక' సంగ్రామంలో సైతం ఫ్యాన్ గాలి కిందనే సేద తీరుతామంటూ వారు తీర్పు ఇచ్చారు. ఫలితంగా టీడీపీ గ్రాఫ్ భారీగా పడిపోతూండగా.. వైఎస్సార్ సీపీ ఓటింగ్ శాతం గణనీయంగా పెరుగుతోంది. ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా గడచిన ఐదేళ్లగా సీఎం వైఎస్ జగన్ అందించిన పాలన ఫలితంగా రానున్న ఎన్నికల్లో కూడా అంతకు మించిన స్థాయిలో ఫలితాలు వస్తాయని ఆ పార్టీ నేతలు విశ్లేషిస్తున్నారు.

ఇటువంటి పరిస్థితుల్లో త్వరలో జరుగుతున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని సింగిల్‌గా ఎదుర్కోవడం కష్టమని భావించిన టీడీపీ.. జనసేన, బీజేపీలతో జట్టు కట్టింది. అయినప్పటికీ, 2019 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, ప్రస్తుత మిత్రపక్షాలకు వచ్చిన ఓట్లు కలిపినా.. వైఎస్సార్ సీపీకి అదనంగా 26,086 ఓట్లు అధికంగా వచ్చాయి. జిల్లాలో గత ఎన్నికల్లో ఐదు ఎమ్మెల్యే స్థానాలను, రాజమహేంద్రవరం ఎంపీ స్థానాన్ని సాధించిన వైఎస్సార్ సీపీ.. ఈ ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. రాజమహేంద్రవరం సిటీ, రూరల్ స్థానాలను, ఎంపీ స్థానాన్ని బీసీ వర్గాలకు, రాజానగరం, నిడదవోలు కాపు సామాజిక వర్గానికి, అనపర్తి రెడ్డి సామాజిక వర్గానికి, గోపాలపురం, కొవ్వూరు నియోజకవర్గాలను ఎస్సీల్లో మాల, మాదిగ సామాజిక సామాజిక వర్గాలకు చెరొకటి చొప్పున కేటాయించి, సామాజిక న్యాయానికి పెద్ద పీట వేసింది. దీంతో ప్రత్యర్థి పార్టీల్లో గుబులు మొదలైంది. వీటికి తోడు జిల్లా వ్యాప్తంగా జరిగిన అన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధించింది. వైఎస్సార్ సీపీ అమలు చేస్తున్న నవరత్నాలు, సంక్షేమ పథకాలతో ఆ పార్టీ మరింత బలం పుంజుకుంది. గత ఎన్నికల వేళ ఇచ్చిన హామీల్లో 99 శాతం పైగా అమలు చేయడం ద్వారా ప్రజల్లో విశ్వసనీయతను నిరూపించుకుంది. ఇదే జోష్‌తో అభ్యర్థులను ముందస్తుగా ప్రకటించింది. అన్ని నియోజకవర్గాల్లోనూ వారు ఇప్పటికే ముమ్మరంగా ఇంటింటా ప్రచారం సాగిస్తూ, ఐదేళ్లలో చేసిన మేలును వివరిస్తూ ప్రజలతో మమేకం అవుతున్నారు. ఈసారి జిల్లాలోని అన్ని స్థానాలూ కైవసం చేసుకోవాలని ప్రణాళికాబద్ధంగా పని చేస్తున్నారు. ఫలితంగా రానున్న ఎన్నికల్లో ఆ పార్టీ గెలుపు నల్లేరుపై నడకే అవుతుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

ఇదే సమయంలో పొత్తుల కత్తులతో విపక్ష టీడీపీ - జనసేన - బీజేపీ కూటమి సతమతమవుతోంది. బరిలో ఎవరు ఉంటారో.. వారికి మిగిలిన పార్టీల వారు మద్దతు తెలుపుతారో తెలపరో అర్థం కాని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతోంది. దాదాపు ప్రతి నియోజకవర్గంలోనూ టికెట్లు దక్కని వారు తిరుగుబాటు బావుటా ఎగురవేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఎన్నికల బరిలో ఏవిధంగా తలపడాలో తెలియక అభ్యర్థులు, ఆ పార్టీల నేతలు, కార్యకర్తలు తలలు పట్టుకుంటున్నారు.

టీడీపీ గ్రాఫ్.. ఉఫ్..

- జిల్లాలోని ఎస్సీ రిజర్వుడు స్థానాలైన గోపాలపురం, కొవ్వూరు నియోజకవర్గాల్లో టీడీపీ ఓటింగ్ శాతం పతనమైంది. 2014, 2019 ఎన్నికల్లో ఆ పార్టీకి లభించిన ఓటింగ్ శాతం ఈ విషయాన్ని చెప్పకనే చెబుతోంది.
- కొవ్వూరులో 2014లో ఎన్నికల్లో 51.88 శాతం ఓటింగ్ సాధించిన టీడీపీకి 2019లో 35.80 శాతం ఓట్లు మాత్రమే పోలయ్యాయి. అంటే వైఎస్సార్ సీపీ ప్రభంజనంతో ఐదేళ్ల కాలంలో ఏకంగా 16.08 శాతం ఓటింగ్‌ను టీడీపీ కోల్పోయింది. వైఎస్సార్ సీపీకి ఓటింగ్ శాతం 43.02 నుంచి 52.35 శాతానికి పెరిగింది. అంటే 2014 కంటే 2019 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓటింగ్ 9.33 శాతం పెరిగిందన్న మాట. 2014లో టీడీపీకి 12,745 మెజార్టీ లభిస్తే 2019లో వైఎస్సార్ సీపీకి ఏకంగా 25,248 ఓట్లు మెజార్టీ దక్కడం విశేషం.
- 2019 ఎన్నికల్లో కొవ్వూరులో జనసేన, దాని మిత్రపక్షమైన బీఎస్పీ అభ్యర్థికి, టీడీపీ అభ్యర్థికి వచ్చిన ఓట్లన్నీ కలిపి చూసినా వైఎస్సార్ సీపీ అభ్యర్థి కంటే 13,571 తక్కువగానే వచ్చాయి. బీఎస్పీ, జనసేన అభ్యర్థికి 11,677 ఓట్లు వస్తే, టీడీపీ అభ్యర్థికి 54,644 ఓట్లు పడ్డాయి. వైఎస్సార్ సీపీకి ఏకంగా 70,892 ఓట్లు పోలయ్యాయి.
- గోపాలపురంలో సైతం ఇంతకంటే మెరుగైన ఫలితాలను వైఎస్సార్ సీపీ సొంతం చేసుకుంది. ఇక్కడ 2014లో 51.14 శాతంగా ఉన్న టీడీపీ ఓటింగ్ గత ఎన్నికల్లో 37.26 శాతానికి పడిపోయింది. అదే సమయంలో వైఎస్సార్ సీపీకి పోలైన ఓట్లు 40.62 శాతం నుంచి 56.04 శాతానికి పెరిగాయి. రెండు ఎన్నికలు కలిపి చూస్తే టీడీపీ కంటే వైఎస్సార్ సీపీకి 25,921 ఓట్లు అదనంగా లభించాయి. 2014లో టీడీపీ అభ్యర్థిగా ఉన్న ముప్పిడి వెంకటేశ్వరరావు 11,540 ఓట్ల మెజార్టీతో గెలవగా.. ఆయనపై 2019 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థి తలారి వెంకట్రావు ఏకంగా 37,461 ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధించారు. ఇంత భారీ వ్యత్యాసంతో ఓటమి పాలైన వెంకటేశ్వరరావు ఈసారి కొవ్వూరు నుంచి వెంకట్రావుపై మూడోసారి తలపడేందుకు సిద్ధం కావడం విచిత్రం.
- 2019 ఎన్నికల్లో జనసేన, బీఎస్పీ అభ్యర్థికి 5,882, టీడీపీకి 74,324 ఓట్లు వచ్చాయి. వైఎస్సార్ సీపీ అభ్యర్థికి మాత్రం ఏకంగా 1,11,785 ఓట్లు పోలయ్యాయి. అంటే టీడీపీ, జనసేన, బీఎస్పీలకు వచ్చిన ఓట్లు కలిపి చూసినా వైఎస్సార్ సీపీకే 31,579 ఓట్లు అధికంగా రావడం గమనార్హం.
- అనపర్తిలో గత ఎన్నికల్లో టీడీపీ, జనసేన అభ్యర్థులకు మొత్తం 69,406 ఓట్లు రాగా, వైఎస్సార్ సీపీకి ఏకంగా 1,11,771 ఓట్లు పోలయ్యాయి. అంటే టీడీపీ, జనసేనకు కలిపి వచ్చిన వాటి కంటే వైఎస్సార్ సీపీకి అదనంగా 42,365 ఓట్లు పోలయ్యాయి.
- రాజానగరంలోనూ గత ఎన్నికల్లో ఇదే విధమైన ఫలితాలు వచ్చాయి. టీడీపీ అభ్యర్థికి 58,908, జనసేనకు 20,847 చొప్పున ఓట్లు పడ్డాయి. వైఎస్సార్ సీపీ అభ్యర్థికి ఏకంగా 90,680 ఓట్లు పోలయ్యాయి. ఆ రెండు పార్టీల ఓట్లు కలిపినా వైఎస్సార్ సీపీకే అదనంగా 10,925 ఓట్లు అధికంగా రావడం విశేషం.

ఆ రెండుచోట్లా టీడీపీ ఓటింగ్ పతనం

గడచిన రెండు సార్వత్రిక ఎన్నికల్లో రాజమహేంద్రవరం సిటీ, రూరల్ నియోజకవర్గాల్లో టీడీపీ విజయం సాధించినప్పటికీ ఓటింగ్ శాతం గణనీయంగా పడిపోయింది. సిటీలో 2014లో 50.24 ఓటింగ్ సాధించిన టీడీపీకి గత ఎన్నికల్లో 49.94 శాతం ఓట్లు పడ్డాయి. గత రెండు ఎన్నికల గణాంకాలు పోల్చి చూస్తే రూరల్‌లో ఆ పార్టీ ఓటింగ్ 52.22 నుంచి ఏకంగా 39.28 శాతానికి పతనమైంది.

ఎంపీ స్థానంలోనూ 'ఫ్యాన్' జోరు

గడచిన రెండు సార్వత్రిక ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే.. రాజమహేంద్రవరం లోక్‌సభ నియోజకవర్గంలో టీడీపీ ఓటింగ్ 54.62 శాతం నుంచి 36.82 శాతానికి పడిపోయింది. ఐదేళ్ల కాలంలో ఏకంగా 17.8 శాతం ఓటింగ్‌ను ఆ పార్టీ కోల్పోయింది. అదే సమయంలో వైఎస్సార్ సీపీ ఓటింగ్ 40.12 నుంచి 46.55 శాతానికి పెరిగింది. రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గంలో తొలి నుంచీ అగ్రవర్ణాల వారే ఎంపీలుగా రాణించారు. ఆ చరిత్రను గత ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తిరగరాసింది. తొలిసారి బీసీ అభ్యర్థి అయిన మార్గాని భరత్‌రామ్‌కు అవకాశం కల్పించి, విజయం సాధించింది. ఇప్పుడు మరోసారి అదే బీసీ సామాజిక వర్గం నుంచి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను బరిలో నిలపడం ద్వారా ప్రత్యర్థి పార్టీల్లో గుబులు పుట్టిస్తోంది.

2014, 2019 సార్వత్రిక ఎన్నికలు కలిపి టీడీపీ, వైఎస్సార్ సీపీకి పోలైన ఓట్లు

నియోజకవర్గం	టీడీపీ	వైఎస్సార్ సీపీ	వైఎస్సార్ సీపీ ఆధిక్యం
గోపాలపురం	1,69,623	1,95,544	+25,921
కొవ్వూరు	1,29,305	1,41,808	+12,503
నిడదవోలు	1,40,904	1,56,233	+15,329
అనపర్తి	1,39,962	1,93,796	+53,834
రాజమహేంద్రవరం సిటీ	1,63,233	1,06,791	-56,442
రాజమహేంద్రవరం రూరల్	1,61,706	1,13,762	-47,944
రాజానగరం	1,40,384	1,63,269	+22,885
మొత్తం	10,45,117	10,71,203	+26,086

హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ ప్రారంభం



శిక్షణ పొందే యువకులతో షబ్నం

రాజమహేంద్రవరం సిటీ: ఏపీఎస్ ఆర్టీసీ హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ 11వ బ్యాచ్ తరగతులు శనివారం ప్రారంభమయ్యాయని రాజమహేంద్రవరం డిపో మేనేజర్ షేక్ షబ్నం తెలిపారు. ఇప్పటి వరకూ 10 బ్యాచ్‌ల్లో 170 మంది శిక్షణ పొందారన్నారు. లైట్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన 18 మంది యువకులతో 11వ బ్యాచ్ శిక్షణ ప్రారంభమైందన్నారు. వీరికి 32 రోజుల పాటు శిక్షణ ఇస్తామని చెప్పారు. వారికి అవసరమైన మెటీరియల్ అందజేశామని షబ్నం తెలిపారు. ఇప్పటి వరకూ శిక్షణ పొంది, హెవీ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ పొందిన వారు ఉత్తమ డ్రైవర్లుగా రాణిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ ఎం.అజయ్ బాబు, మెకానికల్ సూపరింటెండెంట్ పీబీఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆహ్వానం లేదు.. ఫొటోకూ చోటు లేదా!

- నియోజకవర్గ సమావేశానికి జవహర్‌కు అందని ఆహ్వానం
- అలంకారప్రాయంగా జాతీయ ప్రధాన కార్యదర్శి పదవి
- మాజీ మంత్రికి తప్పని పరాభవం
- దళితుడనే వివక్ష అంటూ ఆయన వర్గీయుల ఆగ్రహం
- టీడీపీలో సద్దుమణగని విభేదాలు



జవహర్‌కు మద్దతుగా తాడేపల్లిలోని టీడీపీ రాష్ట్ర కార్యాలయం వద్ద దళిత ప్రజా సంఘాల ఆందోళన

కొవ్వూరు: 'పదవి గొప్ప.. మర్యాద సున్నా' అన్నట్టుగా ఉంది మాజీ మంత్రి కేఎస్ జవహర్ పరిస్థితి. మాజీ మంత్రి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు అయిన ఆయన తాజాగా ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా కూడా నియమితులయ్యారు. ఎంత చరిత్ర ఉంటేనేం.. ఎన్ని పదవులు ఉంటేనేం.. కొవ్వూరులో శనివారం నిర్వహించిన టీడీపీ నియోజకవర్గ స్థాయి సమావేశానికి ఆయనకు కనీస ఆహ్వానం కూడా లేదు. సార్వత్రిక ఎన్నికల్లో కొవ్వూరు అసెంబ్లీ స్థానానికి టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా ముప్పిడి వెంకటేశ్వరరావు పేరు ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత తొలిసారిగా మూడు పార్టీలతో టీడీపీ నేత పెండ్యాల అచ్చిబాబు ఆధ్వర్యాన ఈ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఇంతటి ప్రాధాన్యం కలిగిన ఈ సమావేశానికి జవహర్‌కు ఆహ్వానం లేకపోగా.. ఆ వేదికపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో సైతం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి హోదాలో ఉన్న ఆయన ఫొటోకు చోటు దక్కలేదు. దీనినిబట్టి దళిత సామాజికవర్గ నేతకు టీడీపీలో దక్కిన గౌరవం ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు.

దళితులపై చిన్నచూపు

కేవలం దళిత నేత కావడమే ఆయన చేసిన పాపమా? అంటూ టీడీపీ దళిత నాయకులు మండిపడుతున్నారు. ఆ పార్టీలో దళితులపై వివక్ష చూపుతున్నారనడానికి ఇదే నిదర్శనమని ఆరోపిస్తున్నారు. తానెవరికీ తలవంచే ప్రసక్తే లేదని, పెత్తందార్ల పైనే తన పోరాటమని, పార్టీకి బానిసగా పని చేస్తానని పలు సందర్భాల్లో జవహర్ ఇప్పటికే ప్రకటించారు. అందుకే పెత్తందార్ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశానికి జవహర్‌ను ఆహ్వానించలేదంటూ దళిత నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ సమావేశానికి జవహర్ వర్గీయులు గైర్హాజరయ్యారు. టీడీపీలో పెత్తందార్ల హవానే నడుస్తోందని చెప్పడానికి ఈ సమావేశమే ఓ ఉదాహరణని విమర్శిస్తున్నారు.

టీడీపీ రాష్ట్ర కార్యాలయం వద్ద ధర్నా

మరోవైపు జవహర్‌కు కొవ్వూరు టికెట్ కేటాయించాలని కోరుతూ దళిత ప్రజాసంఘాల ఆధ్వర్యాన తాడేపల్లిలోని టీడీపీ రాష్ట్ర కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ప్లకార్డులు, ఫ్లెక్సీలతో నిరసన తెలిపారు. ఈ ఆందోళనలో రాష్ట్ర వ్యాప్తంగా పలువురు దళిత, ప్రజా సంఘాలు, మాదిగ దండోరా నేతలు పాల్గొని పార్టీ పెద్దలకు వినతి పత్రం సమర్పించారు. గుంటూరు, కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన డప్పు కళాకారులు, చర్మకారులు, ఎంఆర్‌పీఎస్ నాయకులతో పాటు నియోజకవర్గ దళిత నాయకులు కూడా ఈ ఆందోళనలో పాల్గొన్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో జవహర్‌కు టికెట్‌పై టీడీపీలో మరోసారి రచ్చ నడుస్తోంది. తాను పోటీలో ఉంటానని జవహర్ ఇప్పటికే ప్రకటించగా.. ఆయనను అచ్చిబాబు వర్గం పూర్తిగా పక్కన పెట్టి దూకుడుగా వ్యవహరించడంతో విభేదాలకు మళ్లీ ఆజ్యం పోసినట్టయ్యింది. ఎన్నికల వేళ టీడీపీలో విభేదాలు సద్దుమణగకపోవడం చూసి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు తలలు పట్టుకుంటున్నారు.

'ఉపాధి' పనుల్లో వేసవి జాగ్రత్తలు

- కార్మికుల పని గంటలు రీ షెడ్యూల్ చేయాలి
- చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి
- ఎన్నికల కోడ్‌ను దృష్టిలో ఉంచుకోవాలి
- అధికారులకు కలెక్టర్ మాధవీలత ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత. చిత్రంలో డీఆర్‌ఓ నరసింహులు

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): వేసవి ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఉపాధి హామీ పనుల నిర్వహణలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ కె.మాధవీలత ఆదేశించారు. వేసవి నేపథ్యంలో సంబంధిత సమన్వయ శాఖల అధికారులతో కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఏప్రిల్, మే నెలల్లో ఉపాధి హామీ పని గంటలు రీ షెడ్యూల్ చేయాలని, పని చేసే ప్రాంతాల్లో కార్మికులకు నీడ ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఇప్పటికే ఎండల తీవ్రత ఎక్కువగా ఉందని, అన్ని శాఖలూ సమన్వయంతో తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అన్నారు. వేసవిలో మనుషులతో పాటు, జంతువులు, పక్షుల పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలన్నారు. నోడల్ అధికారిగా అన్ని శాఖలతో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి సమన్వయం చేసుకోవాలని సూచించారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ప్రధాన కూడళ్లలో తాగునీరు అందుబాటులో ఉంచాలని, ఆరోగ్య శిబిరాలు నిర్వహించాలని అన్నారు. ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. 108, 104 అత్యవసర సేవలు, అత్యవసర మందులు, తగినంత మంది సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్, పురపాలక సంఘాల ఆధ్వర్యాన తాగునీటి సరఫరాకు ఎటువంటి ఆటంకాలూ లేకుండా ముందస్తు కార్యాచరణ, మరమ్మతులు పూర్తి చేయాలని చెప్పారు. పశువులకు, పక్షులకు నీటి లభ్యత ఉండేలా ప్రజలను చైతన్యపరచాలని పశు సంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు. పిల్లలు ఎండల్లో ఆటలు ఆడకుండా విద్యా సంస్థలు చర్యలు తీసుకోవాలన్నారు. అగ్ని ప్రమాదాలు జరిగే ప్రాంతాలను ముందుగా గుర్తించి తగిన రక్షణ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ మాధవీలత సూచించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి నమూనాలో..

- ఆవిధంగానే రత్నగిరిపై నూతన ధ్వజస్తంభం
- పీఠం నుంచి శిఖరం వరకూ స్వర్ణమయం



శ్రీకాళహస్తి దేవస్థానంలోని స్వర్ణ ధ్వజస్తంభం



శ్రీకాళహస్తి ధ్వజస్తంభంపై కొలువు తీరిన దేవతా మూర్తులు



సత్యదేవుని సన్నిధిలో పీఠం తొలగించిన ప్రస్తుత ధ్వజస్తంభం

అన్నవరం: సత్యదేవుని సన్నిధిలో ఏర్పాటు చేస్తున్న నూతన ధ్వజస్తంభాన్ని శ్రీకాళహస్తి ఆలయంలో మాదిరిగా దిగువన పీఠం నుంచి స్తంభం పై భాగం వరకూ బంగారు రేకుతో తాపడం చేయాలని అధికారులు నిర్ణయించారు. నెల్లూరుకు చెందిన ఒక దాత రూ.4 కోట్లతో నూతన ధ్వజస్తంభం ఏర్పాటుకు, బంగారు రేకు తాపడానికి సంసిద్ధత వ్యక్తం చేసిన విషయం విదితమే. దేవదాయ శాఖ ఉన్నతాధికారుల సూచన మేరకు బంగారు రేకు తాపడం చేసే పనిని చెన్నైకి చెందిన సంస్థకు అప్పగించారు. కొత్త ధ్వజస్తంభం ఏర్పాటుకు ఇప్పటికే 65 అడుగుల కర్ర తీసుకుని వచ్చారు. నూతన ధ్వజస్తంభాన్ని వచ్చే నెల 22న ప్రతిష్ఠించనున్నారు. ఈ ప్రతిష్ఠా మహోత్సవాలకు వచ్చే నెల 18న శ్రీకారం చుడతారు. సత్యదేవుని ఆలయంలో ప్రస్తుతం వెండి రేకు తాపడంతో ఉన్న ధ్వజస్తంభం తొలగింపు పనులు మంగళవారంతో పూర్తవుతాయని డీఈ ఉదయ్ తెలిపారు. ఆ రోజు ధ్వజస్తంభాన్ని పైకి లేపి, నేలపై ఉంచుతారని, అనంతరం ఆ కర్రకు ఉన్న వెండి రేకు తొలగిస్తారని చెప్పారు. దేవదాయ శాఖ జ్యూయలరీ వెరిఫికేషన్ అధికారి సమక్షంలో వెండి రేకు బరువు తూచి, దేవస్థానంలో భద్రపరచనున్నారు. దీని కోసం దేవస్థానం అధికారులతో ఈఓ కె.రామచంద్ర మోహన్ ఒక కమిటీ ఏర్పాటు చేశారు. నూతన ధ్వజస్తంభం ప్రతిష్ఠ అనంతరం తొలగించిన పీఠంలోని గ్రానైట్ శిల్పాలను యథాతథంగా అమరుస్తారు. అనంతరం పీఠం కొలతలు తీసి, బంగారు రేకు తయారు చేస్తారు. ఆ తరువాత బంగారు రేకు తాపడం పనులు ప్రారంభిస్తారు. ధ్వజస్తంభంపై నాలుగు వైపులా దేవతామూర్తులను ఏర్పాటు చేయనున్నారు. నూతన స్వర్ణ ధ్వజస్తంభంతో దేవాలయం స్వర్ణ శోభను అద్దుకోనుంది.

రథానికి వెండి రేకు తాపడం

రత్నగిరిపై ఆలయ ప్రాకారంలో ప్రతి ఆదివారం ఉదయం నిర్వహిస్తున్న రథసేవలో ఉపయోగిస్తున్న సత్యదేవుని నూతన టేకు రథానికి వెండి రేకు తాపడం చేయించాలని దేవదాయ, ధర్మదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఆదేశించారు. ఈఓ కె.రామచంద్ర మోహన్ శనివారం ఈ విషయం తెలిపారు. వెండి తాపడం చేసేందుకు దాతలు ముందుకు వస్తే అవకాశం కల్పించాలని, లేకుంటే దేవస్థానం వద్ద ఉన్న వెండితోనైనా తాపడం చేయించాలని ఆదేశించారని వివరించారు. ఈ రథానికి వెండి తాపడం చేయించాలని గతంలోనే అనుకున్నారు. అయితే దాతలు ముందుకు రాకపోవడంతో గత నెల 16న రథసప్తమి పర్వదినం సందర్భంగా ఈ రథాన్ని రత్నగిరికి తరలించారు. గత నెల 22న ఈ రథంపై స్వామి, అమ్మవార్ల ఊరేగింపు ప్రారంభించారు. ఆ తరువాత ప్రతి ఆదివారం దీనిని కొనసాగిస్తున్నారు. ఈ రథ సేవను రూ.2,500 టికెట్టుతో ఆర్జిత సేవగా నిర్వహించేందుకు కూడా కమిషనర్ ఆమోదం తెలిపారు. గత ఆదివారం నుంచే ఈ ఆర్జిత సేవను దేవస్థానంలో అమలు చేస్తున్నారు.



సత్యదేవుని టేకు రథ సేవ

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.42.47 లక్షలు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. స్వామి పూర్ణాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి అధిక సంఖ్యలో భక్తులు గౌతమీ గోదావరిలో స్నానాలు ఆచరించి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఆవరణలో ఉన్న క్షేత్ర పాలకుడు అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామిని సైతం భక్తులు దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేక దర్శనం, అన్నప్రసాద విరాళాలు, సేవలు, లడ్డూ ప్రసాద విక్రయాలు, ఇతర విరాళాలు, ఆన్‌లైన్ ద్వారా స్వామివారికి సుమారు రూ.42,47,223 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు.

క్లుప్తంగా

మూణ్నాళ్ల మురిపెం! ఆ సిరా గురుతు!!



అంబాజీపేట: 'నీ వేలిపై సిరా చుక్క దేశ ప్రగతికి వేగు చుక్క' అంటూ ఎన్నికల సంఘం ఓటు విలువను తెలియజేస్తుంటుంది. ఓటు హక్కును వినియోగించుకున్న ప్రతి వ్యక్తికీ ఎడమచేతి బొటన వేలిపై సిరా చుక్క పెడతారు. చేతి వేళ్లులేని దివ్యాంగులకు కాలి వేళ్లకు సిరా చుక్క పెడతారు. ఇది ఓటేశామని గుర్తు మాత్రమే కాదు. దొంగ ఓట్లను నిరోధించే ఆయుధం. ఎన్నికలలో వాడే ఇండెలిబుల్ ఇంక్ వేలిపై పెడితే 72 గంటల పాటు చెరిగిపోదు. ఈ సిరాను 1962 నుంచి కర్ణాటకలోని మైసూర్ పెయింట్స్ అండ్ వార్నిష్ కంపెనీ తయారు చేస్తోంది. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా ఆ కంపెనీ నుంచే సిరా సరఫరా అవుతుంది. సిరాలో 7.25 శాతం సిల్వర్ నైట్రేట్ ఉండడంతో ఎక్కువ కాలం చెరిగిపోకుండా ఉంటుంది.

ఆబోతు మృతదేహం ఊరేగింపు



వాడపాలెంలో ఆబోతు మృతదేహాన్ని ఖననం చేస్తున్న దృశ్యం

కొత్తపేట: మండలంలోని వాడపాలెంలో ఒక ఆబోతు మృతి చెందగా దానిని గ్రామంలో ఊరేగించి, ఖననం చేశారు. గ్రామానికి చెందిన రంకిరెడ్డి త్రిమూర్తులు, శ్రీనివాస్ అనే తండ్రీ, తనయులు సుమారు ఐదేళ్ల క్రితం ఆవుకు, ఆబోతుకు పెళ్లి చేసి ఆబోతును గ్రామంలో వదిలారు. దాంతో ఆ ఆబోతు వాడపాలెం, పరిసర పనసలదొడ్డి, పెదరాముడినూతిమెరక, చినరాముడినూతిమెరక తదితర శివారు గ్రామాల్లో తిరుగుతూ ఉండేది. ఈ ఆబోతు శుక్రవారం వాడపాలెంలో ఒకరి ఇంటి సెప్టిక్ ట్యాంక్‌లో పడి మృతి చెందింది. ఆబోతు మృతదేహాన్ని అతి కష్టం మీద బయటకు తీయగా ఆబోతును వదిలిన త్రిమూర్తులు కుటుంబం ఆ ఆబోతు మృతదేహాన్ని తమ ఇంటికి తీసుకువెళ్లి పూజలు నిర్వహించి, ట్రాక్టరుపై గ్రామంలో మేళతాళాలతో ఊరేగించారు. అనంతరం తమ సొంత భూమిలో ఖననం చేయించారు.

జగన్‌ను సీఎం చేయడమే లక్ష్యం

మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ

కిర్లంపూడి: రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అధికారంలోకి తీసుకురావడమే ప్రధాన లక్ష్యంగా నాయకులు, కర్యకర్తలు పనిచేయాలని మాజీ మంత్రి, కాపు ఉద్యమనేత, వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం అన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నుంచి సుమారు 150 మంది నాయకులు, కార్యకర్తలు శనివారం ముద్రగడను, యువ నాయకుడు గిరిబాబును వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గం ఇన్చార్జి, ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జక్కంపూడి గణేశ్ ముద్రగడను మర్యాద పూర్వకంగా కలిశారు. ఎన్నికల ప్రచారానికి తీసుకోవాలసిన ప్రణాళికలపై వారితో చర్చించారు. ఈ సందర్భంగా ముద్రగడ మాట్లాడుతూ నిరుపేదలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.



ముద్రగడను ఆయన నివాసంలో కలుసుకున్న ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నాయకులు, గూడూరి శ్రీనివాస్, జక్కంపూడి గణేశ్

మరిన్ని సంక్షేమ పథకాలతో పాటు రాష్ట్రాభివృద్ధికి రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ ముద్రగడ పద్మనాభం వైఎస్సార్ సీపీలోకి రావడం పార్టీకి మరింత బలం చేకూరిందన్నారు. రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గాల్లో సేవలందించేదుకు ముద్రగడను ఆహ్వానించినట్టు తెలిపారు. రానున్న ఎన్నికల్లో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని 7 నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధిస్తుందన్నారు. పశ్చిమగోదావరి జిల్లా రాష్ట్ర కాపు జేఏసీ సభ్యుడు తోట రామకృష్ణ, జిల్లా కాపు సంఘం అధ్యక్షుడు చిన్నిమిల్లి వెంకటరాయుడు, గణేశుల రాంబాబు, నీలి ఆనంద్, అడపా అనిల్, ఇసుకపల్లి శ్రీను, గణేశుల లచ్చబాబు, గౌతు స్వామి తదితరులు ఉన్నారు.

సీఎంఆర్ జ్యువెలరీ షోరూమ్ ప్రారంభం



సీఎంఆర్ జ్యువెలరీ ప్రారంభోత్సవంలో పాల్గొన్న సినీ నటి అమృత అయ్యర్, సంస్థ ఎండీ మావూరి వెంకటరమణ తదితరులు

కాకినాడ సిటీ: నగరంలో సీఎంఆర్ జ్యువెలరీ ఎక్స్‌క్లూజివ్ షోరూమ్‌ను హనుమాన్ ఫేమ్ హీరోయిన్, సినీనటి అమృత అయ్యర్, రాష్ట్ర రైస్ మిల్లర్ల అసోసియేషన్ చైర్మన్ ద్వారంపూడి వీరభద్రారెడ్డి, కొడా చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, గోదావరి చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ పెద్ది రత్నాజీ, సీఎంఆర్ గ్రూప్ ఫౌండర్ అండ్ చైర్మన్ మావూరి వెంకటరమణ తదితరులు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మావూరి వెంకటరమణ మాట్లాడుతూ కాకినాడలో అతి పెద్ద బంగారు ఆభరణాల ఎక్స్‌క్లూజివ్ షోరూమ్ ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. వినియోగదారుల శైలికి తగ్గట్టుగా ప్రాచీనత నుంచి ఆధునికత వరకు అన్ని రకాల ఆభరణాలు అందుబాటులో ఉంచామన్నారు. తమ షోరూమ్‌లో బంగారు ఆభరణాలపై అతి తక్కువ తరుగు 3 శాతం నుంచి ప్రారంభం అన్నారు. వెండి వస్తువులపై తరుగు, మజూరీ లేదన్నారు. దాదాపు ఐదు దశాబ్దాలుగా ఆభరణాల వ్యాపారంలో అత్యంత సుప్రసిద్ధమైన సంస్థల్లో ఒకటిగా ఖ్యాతి గడించిన సంస్థ సీఎంఆర్ ఎక్స్‌క్లూజివ్ జ్యువెలరీ షోరూమ్ అని సినీనటి అమృత అయ్యర్, ద్వారంపూడి వీరభద్రారెడ్డి అన్నారు. సీఎంఆర్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ మావూరి మోహన్ బాలాజీ మాట్లాడుతూ మార్కెట్‌లో ప్రస్తుత ట్రెండ్‌కి అనుగుణంగా లేటెస్ట్ కలెక్షన్లతో సీఎంఆర్ ఎక్స్‌క్లూజివ్ షోరూమ్‌ను కాకినాడ దేవాలయం వీధిలో ఏర్పాటు చేశామన్నారు. ప్రారంభోత్సవం సందర్భంగా గ్రాముకు రూ.250 వరకు తగ్గింపు ప్రకటించినట్టు తెలిపారు. కార్యక్రమంలో కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ మేనేజర్ వైఎల్ చౌదరి, ప్రముఖ వ్యాపారవేత్త రాపాక వెంకట్ ఆనంద్, బాదం సుందరరావు, పి.మంగరాజు, గొడవర్తి లక్ష్మీ లావణ్య, మేనేజర్లు బి.రమేష్‌కుమార్, ఆసిఫ్ ఇక్బాల్, లయన్ రాజు, మాజీ కార్పొరేటర్ బన్నీ పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశాల గడువు పెంపు

తుని రూరల్: ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి గడువు పెంచినట్టు కన్వీనర్, తుని పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్ఎంటీ హేమలత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తుని (బాలికలు), భూపతిపాలెం (బాలురు) ఐదో తరగతి అన్ని సీట్లు, ఆరు, ఏడు, ఎనిమిది తరగతుల్లో మిగిలిన సీట్లు, ఇంటర్మీడియట్, డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల గడువు వచ్చే నెల ఐదో తేదీ వరకు పొడిగించినట్టు ఆమె పేర్కొన్నారు. 2024–25 సంవత్సరానికి ఈ నెల 31తో గడువు ముగిసిందని, గడువు పెంపును ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో చదువుకున్న విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. ఆసక్తి, అర్హతగల విద్యార్థులు ఏపీఆర్ఎస్.ఏపీఎఫ్ఎస్ఎస్.ఐఎన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 87126 25029 ఫోన్ నంబరులో సంప్రదించాలన్నారు.

'క్రాఫ్ట్ పేపర్స్'లో అగ్ని ప్రమాదం


- రూ.7 కోట్లకు పైగా ఆస్తినష్టం
- పరిశీలించిన డీఎస్పీ అంబికా ప్రసాద్



పరిశ్రమలో చెలరేగిన మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కడియం: మండలంలోని జేగురుపాడు శివార్లలోని శ్రీ మెహర్‌గాయత్రీదేవి క్రాఫ్ట్‌పేపర్స్ ఎల్ఎల్‌పీ పరిశ్రమలో 28వ తేదీ తెల్లవారు జామున అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో సరఫరాకు సిద్ధంగా ఉన్న క్రాఫ్ట్ పేపర్‌తో పాటు, యంత్ర సామగ్రి కూడా మంటల్లో చిక్కుకుని దెబ్బతిందని బాధితులు తెలిపారు. ఈ మేరకు సదరు మిల్లు మేనేజర్ మండపేట మండలం గొల్లపూడికి చెందిన కంఠంశెట్టి మల్లికార్జున రావు కడియం పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. నిల్వ ఎక్కువగా ఉండడంతో రెండు నెలలుగా మిల్లు నిలిపివేశామని ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే 28వ తేదీ తెల్లవారు జామున తమ యజమాని వల్లూరి మెహర్ చైతన్యకు సెక్యూరిటీ నుంచి అగ్ని ప్రమాదం విషయమై ఫోను వెళ్లిందన్నారు. ఆయన తనకు సమాచారం ఇచ్చారని వెంటనే తాను ప్రమాదస్థలికి చేరుకున్నానన్నారు. రాజమహేంద్రవరం, మండపేట, అనపర్తిలకు చెందిన ఫైర్ ఇంజిన్లు వచ్చి మంటలను ఆర్పాయన్నారు. ఈ ప్రమాదంలో సరఫరాకు సిద్ధంగా ఉన్న క్రాఫ్ట్‌పేపర్, యంత్రసామగ్రి తదితర వస్తువులు కాలిపోవడంతో ఏడు కోట్ల రూపాయల వరకు నష్టం సంభవించిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. మిల్లు మేనేజర్ ఫిర్యాదు మేరకు రాజమహేంద్రవరం దక్షిణ మండలం డీఎస్పీ అంబికా ప్రసాద్, కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్ తమ సిబ్బందితో అక్కడికి చేరుకుని విచారణ ప్రారంభించారు. అలాగే అగ్నిమాపక సిబ్బంది, విద్యుత్, పరిశ్రమల శాఖ సిబ్బందికి కూడా ఘటనా స్థలానికి చేరుకుని ఫిర్యాదు చేసారు. కాగా ఊరికి దూరంగా మిల్లు ఉండడంతో పాటు, గత కొన్నాళ్లుగా పనిచేయకపోవడంతో ప్రమాద సమాచారం బయటకు రావడం ఆలస్యమైంది. ఇదిలా ఉండగా ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉంది.

పవన్ వస్తారని పాదగయకు నో ఎంట్రీ



పాదగయ క్షేత్రంలో గేట్లు మూసి భక్తులను నిలిపివేసిన అధికారులు

పిఠాపురం: జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ పాదగయలో పూజలు నిర్వహిస్తారనే సమాచారంతో అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించారు. కాకినాడ బైపాస్ రోడ్డు వైపు ఉన్న పాదగయ క్షేత్రం గేట్లు మూసివేసి భక్తులను రానివ్వకుండా అడ్డుకోవడంతో భక్తులు ఆందోళన వ్యక్తం చేశారు. సుదూర ప్రాంతాల నుంచి స్వామి, అమ్మవార్ల దర్శనం కోసం వచ్చిన తమను రాజకీయ నాయకులు వస్తున్నారనే వంకతో ఆలయంలో ప్రవేశం లేదని నిలిపివేయడం ఎంత వరకు సమంజసమంటూ ప్రశ్నించారు. సాయంత్రం 4 గంటల నుంచి ఆరు గంటల వరకు దర్శనాలు నిలిపివేయడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆరు గంటలకు పవన్‌కల్యాణ్ పర్యటన వాయిదా పడిందనే సమాచారంతో భక్తులను అనుమతించారు.

రివర్‌బేపై విజిలెన్స్ దాడులు



హోటల్ రివర్ బేలో తనిఖీలు చేస్తున్న అధికారులు

- 25శాతం టీపీసీ దాటిన వంటనూనె
- కార్పొరేషన్‌కు రూ.13.77 లక్షల బకాయిల గుర్తింపు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం సిటీ): స్టార్ హోటల్‌గా పేరొందిన గోదావరి గట్టున ఉన్న రివర్ బే హోటల్‌ను శనివారం విజిలెన్స్, ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ, రెవెన్యూ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ దాడుల్లో వంటనూనె 25 శాతం టోటల్ పోలార్ కాంపౌండ్ (టీపీసీ) దాటి ఉండడాన్ని గుర్తించారు. అంతేగాక మరిన్ని అక్రమాలను గుర్తించారు. హోటల్ నుంచి ఫుడ్ సేఫ్టీ అధికారులు చికెన్ ఫ్రై నమూనాలను సేకరించి ఫుడ్ లాబొరేటరీకి పంపించారు. అదే విధంగా హోటల్‌లో ఉపయోగిస్తున్న ఎడిబుల్ ఆయిల్స్‌లో టోటల్ పోలార్ కాంపౌండ్స్ మీటర్ రీడింగ్ 25 శాతం లోపు ఉండాల్సి వుండగా దానికన్న ఎక్కువగా ఉండడంతో ఫుడ్ సేఫ్టీ అధికారులు జాయింట్ కలెక్టర్ కోర్టులో కేసు నమోదు చేశారు. అంతే కాకుండా హోటల్ యాజమాన్యం రూ.13,77,220 మున్సిపల్ కార్పొరేషన్ డిమాండ్ నోటీసు ప్రకారం ట్రేడ్ లైసెన్సు ఫీజు బకాయి ఉన్నట్లు గుర్తించారు. హోటల్‌లో స్టాంప్ లేని తూకం యంత్రం ఉండడంతో లీగల్ మెట్రాలజీ అధికారులు వేయింగ్ మెషీన్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేశారు. జీఎస్టీ రిటర్న్‌లు సెప్టెంబర్–2023 నుండి ఫైల్ చేయనట్టు గుర్తించినట్టు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో హోటల్స్, రెస్టారెంట్లలో కిచెన్లు పరిశుభ్రంగా వుంచాలని, రెస్టారెంట్లలో ఫుడ్ సేఫ్టీ అధికారులు సూచనల మేరకు వినియోగదారులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారపదార్థాలు అందించాలని, లేకపోతే సంబంధిత రెస్టారెంట్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి అన్నారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ అధికారులు ముత్యాలు నాయుడు, శ్రీనివాస రెడ్డి, నాగ వెంకట రాజు, భార్గవ్ మహేష్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రుక్కయ్య, లీగల్ మెట్రాలజీ అధికారి సాల్మాన్ రాజు, వలి, శివ పాల్గొన్నారు.

సరైన పత్రాలు లేని 679 చీరలు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న చీరలు

గోపాలపురం: హైదరాబాదు నుంచి విశాఖపట్టణానికి అనధికారికంగా తరలిస్తున్న 679 పట్టుచీరలను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై కర్రి సతీష్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు హైదరాబాద్ నుంచి విశాఖకు ప్రైవేటు బస్సులో 10 బాక్సులలో 679 చీరలను తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు అంతర్ జిల్లా సరిహద్దు జగన్నాథపురం చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహించామని, ఎటువంటి ఆధారాలు లేవని తేలడంతో వాటిని స్వాధీనం చేసుకుని వాణిజ్యపన్నుల విభాగానికి అప్పగించినట్టు ఎస్సై చెప్పారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి ఫ్యామిలీ
రాజమహేంద్రవరం
ఆదివారం ॥ 31-3-2024

వైరల్



ఆడపిల్లే అదృష్టదేవత

పైలట్ టీనా గోస్వామి ఆసక్తికరమైన వీడియోలను 'పైలట్ మమ్మీ' శీర్షికతో ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేస్తుంటుంది. తాజాగా పోస్ట్ చేసిన ఒక బామ్మ వీడియో వైరల్‌గా మారింది. గ్రామీణత ఉట్టిపడే ఆహార్యంతో కనిపిస్తున్న ఒక బామ్మ అయోధ్య ధామ్‌కు వెళ్లే విమానంలోకి మెట్లకు నమస్కరిస్తూ ఎక్కింది. విమానంలో కనిపించిన పైలట్ టీనా గోస్వామిని ఆప్యాయంగా పలకరించింది. 'మన భారతీయ సనాతన సంస్కృతిలో ఆడపిల్ల.. మన లక్ష్మి' అంటూ టీనాను ఆశీర్వదించింది. బామ్మ కాళ్లకు గౌరవంగా నమస్కరించింది టీనా. రెండు మూడు రోజుల వ్యవధిలోనే ఈ వీడియో ముప్పై లక్షల వ్యూస్ దక్కించుకుంది. హృదయాన్ని హత్తుకునే ఈ వీడియో గురించి కామెంట్ సెక్షన్‌లో ప్రశంసలు వెల్లువెత్తాయి.

సంతకాన్ని జంతర్‌మంతర్ చేసినచో...

శూన్యంలో నుంచి కూడా కళను సృష్టించే నైపుణ్యం ఆర్టిస్ట్‌ల సొంతం. తాజా విషయానికి వస్తే... ఇండిగో ఫ్లైట్ అటెండెంట్ తెల్లకాగితంపై చేసిన సంతకాన్ని క్షణాల్లో అందమైన చిత్రంగా మార్చాడు రాబిన్ బార్. సంతకం నుంచి అప్పటికప్పుడు ప్రేయసీప్రియులను సృష్టించిన రాబిన్ బార్ ఇలాంటి అలాంటి ఆర్టిస్ట్ కాదు...రికార్డ్ హోల్డర్ స్పీడ్ పెయింటర్. జస్ట్...కొన్ని రోజుల వ్యవధిలోనే ఈ వీడియో క్లిప్ 21 మిలియన్‌ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది. రాబిన్ బార్‌పై నెటిజనుల నుంచి ప్రశంసలు వెల్లువెత్తాయి.





వీల్‌చైర్‌లో వచ్చాడు... విల్‌పవర్ చూపాడు

వీల్‌చైర్‌కు పరిమితమైన ఈ యువకుడు విల్ పవర్ మాత్రం ఎప్పుడూ కోల్పో లేదు. స్నేహితుల సహాయంతో వీల్‌చైర్‌లో నుంచి రిషికేష్‌లో బంగీ జంప్ చేశాడు. ఈ వీడియోతో ప్రపంచవ్యాప్తంగా నెటిజనుల మనసు దోచుకున్నాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో 24 మిలియన్‌ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది. 'ఎవ్రీథింగ్ ఈజ్ పాసిబుల్ ఇఫ్ యూ డేర్' 'మోర్ పవర్ టు యూ, బాయ్'లాంటి కామెంట్స్ కనిపించాయి. చాలామంది హార్ట్ ఇమోజీలతో రియాక్ట్ అయ్యారు. గతంలో లెఫ్టినెంట్ కల్నల్ అవనీష్ బాజ్‌పాయ్ ఆర్టిఫిషియల్ లింబ్‌తో భటిండాలో 14,000 అడుగుల ఎత్తు నుంచి స్కైడైవింగ్ చేసిన వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది.

సెల్ఫ్-లవ్



వెనకటికి ఒక ఈగ ఇల్లలుకుతూ ఇంటి పనుల్లో పడి పేరు మరచిపోయిందట. చాలామంది మహిళలు ఇంటిపనుల్లో తలమునకలై పోయి తమ ఇష్టాలను మరచిపోతుంటారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రొఫెసర్ ఫల్గుణి గృహిణుల కోసం ఒక వీడియో చేసింది.

'మహిళలు తమ భర్త, పిల్లల కోసం ఇష్టమైన వంటకాలను తయారుచేసే వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేయడం చూశాను. మరి మీ కోసం ఎప్పుడు తయారు చేస్తారు? మీ కుటుంబ సభ్యులకు నచ్చిన వంటకాల గురించి మాత్రమే కాదు మీకు నచ్చిన వాటి గురించి కూడా దృష్టి పెట్టండి' అంటూ తనకు బాగా నచ్చిన వంటకాన్ని తయారుచేస్తున్న వీడియోను ఫల్గుణి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. ఈ వైరల్ క్లిప్ 1.4 మిలియన్‌ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది. ఈ వీడియో క్లిప్ చూసి ఒక మహిళ ఇలా స్పందించింది... 'నీకు ఇష్టమైనది చేసి పెడతాను. ఏంచేయమంటావు అని అడిగింది అమ్మ. వెంటనే సమాధానం చెప్పలేకపోయాను. పెళ్లయిన తరువాత ఇంటిపనుల్లో పడి నాకు ఇష్టమైన వంటకం ఏమిటో కూడా మరిచిపోయాను. ఈ వీడియో చూసిన తరువాత సెల్ఫ్-లవ్ ప్రాముఖ్యత గురించి రియలైజ్ అయ్యాను'

ధోనీ... ఈసారి ఇలా కానియ్!



ఎం.ఎస్. ధోనీ కెప్టెన్‌షిప్ క్వాలిటీస్ మాత్రమే కాదు సరికొత్త హెయిర్ స్టైల్, సరికొత్త బైక్ కూడా నెటిజనులకు ఆసక్తికరమే. తాజాగా ధోని 'డూడుల్ వీ3 ' ఇ–బైక్ రైడింగ్ వీడియో వైరల్ అయింది. రోజుల వ్యవధిలోనే 1.3 మిలియన్‌ల వ్యూస్‌తో దూసుకుపోతుంది. ధోని రైడింగ్ వీడియోలు వైరల్ కావడం కొత్త కానప్పటికీ ఎకో–ఫ్రెండ్లీ మోడ్ ఆఫ్ ట్రాన్స్‌పోర్టేషన్‌ను ప్రమోట్ చేసే ఈ మేడ్–ఇన్–ఇండియా ఎలక్ట్రికల్ సైకిల్ వీడియో నెటిజనులలో ప్రత్యేక ఆసక్తిని రేకెత్తించింది.

హాయి హాయిగా... కూల్ కూల్‌గా!

ఎలాంటి క్యాప్షన్ లేకుండా రమీజ్ అనే యూజర్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన చెన్నై ఆటోడ్రైవర్ వీడియో 3 కోట్ల ఎనభై ఎనిమిది లక్షలకు పైగా వ్యూస్‌తో దూసుకుపోతోంది. 'ఏమిటీ ఆటోడ్రైవర్ స్పెషాలిటీ?' అనే విషయానికి వస్తే... ఎండా కాలంలో చెన్నైలో వేడి అంతా ఇంతా కాదు. ఈ వేడిని తట్టుకోవడానికి సదరు ఆటోడ్రైవర్ ఎకో ఫ్రెండ్లీ ఏసీ ఫ్యాన్‌ను తయారుచేసి తన ఆటోలో బిగించాడు. ఆటోడ్రైవరే కాదు ప్రయాణికులు కూడా హాయి హాయిగా కూల్ కూల్‌గా ప్రయాణిస్తున్నారు.



వద్దమ్మా.. తప్పు!



ఈ మధ్య 'గైడింగ్ హ్యాండ్స్' అంటూ ఒక వీడియో వచ్చింది. అది వెక్కిరింత వీడియో. ఫోన్ చూసుకుంటూ తల ఎల్లవేళలా కిందకు దించి ఉండేవారిని చేయి పట్టి చేరవలసిన చోటుకు చేర్చే'సహాయక చేతులను' భవిష్యత్తులో ఉపాధిగా చేసుకోవచ్చని అందులో చూపుతారు. అంటే అంధులను చేయి పట్టి నడిపించేవారికి మల్లే ఈ ఫోన్ బానిసలను చేయి పట్టి నడిపించి చార్జ్ తీసుకునే వ్యక్తులు భవిష్యత్తులో వస్తారన్న మాట. మనం ఫోన్‌కు శ్రుతి మించి ఎడిక్ట్ అయ్యామని చెప్పేందుకు ఈ వీడియో చేశారు. బండి మీద వెళుతూ ఫోన్ మాట్లాడితే ప్రమాదం అని ఎన్నిసార్లు చెప్పినా ఎవరూ వినడం లేదు. కొందరు హెల్మెట్‌లో దూర్చి మరీ ఫోన్ మాట్లాడుతూ ప్రమాదం బారిన పడతారు. మరికొందరు హెడ్‌ఫోన్స్‌తో మాట్లాడుతూ వెనకొచ్చే వాహనాల హారన్ వినక ప్రమాదంలో పడుతున్నారు. మొన్నటి మార్చి 26న బెంగళూరు విద్యారణ్యపురలో ఒక మహిళ ఇలా ఫోన్ బిగించి కట్టి మాట్లాడుతూ ఒక వ్యక్తి కెమెరాకు చిక్కింది. అతను షూట్ చేసి ఇన్‌స్టాలో పోస్ట్ చేయడంతో వైరల్ అయ్యింది. అందరూ ఇలా చేయడం ప్రమాదం అన్నారు. ఈ ఎండల్లో ఫోన్ వేడెక్కి పేలినా ప్రమాదమే అని మరికొందరు హెచ్చరించారు. పోలీసులు ఏం చేస్తున్నారని కొందరు ప్రశ్నించారు. చివరకు వీడియో పోలీసుల వరకూ వెళ్లింది. బండి నంబర్ ఆధారంగా ఆ మహిళను గుర్తించి యలహంక ట్రాఫిక్ స్టేషన్ వారు 5 వేల రూపాయల ఫైన్ వేశారు. అవసరమా ఇదంతా?

హెల్త్



కుటుంబ సభ్యుల ఆరోగ్యం మీద పెట్టినంత శ్రద్ధ తమ విషయానికి వచ్చేసరికి మహిళలు గాలికి వదిలేస్తారు. కుటుంబ సభ్యులు కూడా అంతగా పట్టించుకోరు. దాంతో ఏదైనా ఆరోగ్య సమస్య వచ్చి, అది తీవ్రరూపం దాల్చేవరకు ఎవరూ సీరియస్‌గా తీసుకోరు. అలాంటి సమస్యల్లో 'డీప్ వీన్ థ్రాంబోసిస్' ఒకటి. ఇది స్త్రీ, పురుషులిద్దరికీ వచ్చే సమస్య అయినప్పటికీ... మహిళల్లో రిస్క్ ఫ్యాక్టర్స్ ఎక్కువ. గర్భధారణ నుంచి హార్మోన్ల సంక్లిష్టతల వరకు అనేక అంశాలు డీప్ వీన్ థ్రాంబోసిస్‌కు దారితీస్తాయి. రక్తనాళాల్లో... ప్రధానంగా చెడు రక్తాన్ని తీసుకెళ్లే సిరల్లో రక్తం గడ్డకట్టడాన్ని 'డీప్ వీన్ థ్రాంబోసిస్' (డీవీటీ)గా చెబుతారు. ఈ సమస్యపై అవగాహన కోసం ఈ కథనం.

మహిళకు డీప్ వీన్ థ్రాంబోసిస్ చేసే చేటు!

డీప్ వీన్ థ్రాంబోసిస్ అనేది చాలా ప్రమాదకరమైన పరిస్థితి. కాలి సిరల్లో ఇది ఎక్కువగా కనిపిస్తుంది. ఇంచుమించు ప్రతి 20 మందిలో ఒకరికి... వారి జీవితకాలంలో డీప్ వీన్ థ్రాంబోసిస్ బాధపెడుతుంది.

మహిళల్లోనే ప్రభావం చూపడానికి కారణాలు...

1. ప్రెగ్నెన్సీ : స్త్రీలలో ఈ సమస్య మరింత ఎక్కువగా కనిపించడానికి గల కారణాలలో గర్భధారణ ఒకటి. గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం తర్వాత ఆరు వారాల వరకు ఈ ముప్పు ఉంటుంది. గర్భధారణ తర్వాత రక్తనాళాల్లో రక్తప్రవాహం కాస్త నెమ్మదించడం మామూలే. దాంతో రక్తం గడ్డ కట్టే అవకాశాలు పెరగడం.



2. గర్భసంచి బాగా సాగడం: దీంతో రక్తనాళాలపై ఒత్తిడి పడి రక్తం సాఫీగా ప్రవహించడానికి ఆటంకం కలుగుతుంది.

3. నోటి ద్వారా తీసుకునే గర్భనిరోధక మాత్రలు: వీటిల్లోని హార్మోన్లతో డీప్ వీన్ థ్రాంబోసిస్ వచ్చే అవకాశాలు పెరుగుతాయి. దాదాపు ప్రతి గర్భనిరోధక మాత్రలో ఈస్ట్రోజెన్, ప్రొజెస్టిన్ ఉండటంతో అవి రక్తనాళాల్లో రక్తం గడ్డ కట్టేలా చేసే అవకాశాలు పెరుగుతాయి. పైగా ఈస్ట్రోజెన్... కాలేయాన్ని ప్రేరేపించి... రక్తంలో ఉండే బ్లడ్ క్లాటింగ్ ఫ్యాక్టర్ రక్తం గడ్డకట్టేలా చేసే ఫైబ్రినోజెన్‌ను ఎక్కువగా స్రవింపజేస్తుంది. దీనికితోడు గర్భనిరోధక మాత్రల్లో వాడే కొన్ని రకాల కాంబినేషన్స్ పిల్స్ వల్ల ఈ ముప్పు మరింత పెరుగుతుంది. అందువల్ల గర్భనిరోధక మాత్రలు వాడేవారు డాక్టర్ సలహా మేరకే వాడాలి.

4. హార్మోనల్ రీప్లేస్‌మెంట్ థెరపీ: మెనోపాజ్ తర్వాత తీసుకునే హార్మోనల్ రీప్లేస్‌మెంట్ థెరపీలోని మందుల్లో ఈస్ట్రోజెన్, ప్రొజెస్టిన్ కాంబినేషన్ ఉంటుంది. ఈ ఈస్ట్రోజెన్ పైన పేర్కొన్న ప్రభావాన్నే చూపడంతో డీప్ వీన్ థ్రాంబోసిస్ ముప్పు పెరుగుతుంది. అందువల్ల ఈస్ట్రోజెన్ మందుల్ని చర్మానికి అంటించే ప్యాచ్‌ల రూపంలో ఇస్తే ఈ ముప్పు తగ్గుతుంది.



5. జీవనశైలి అంశాలు: శారీరక శ్రమ లేకుండా ఒకేచోట ఎక్కువసేపు కూర్చుని ఉండటం, స్థూలకాయం, పొగతాగడం వంటివి రక్తప్రవాహానికి ఆటంకం కలిగిస్తాయి. స్మోకింగ్ ద్వారా దేహంలోకి చేరే నికోటిన్ రక్తాన్ని గడ్డకట్టేలా చేస్తుంది.

వేర్వేరుగా లక్షణాల తీవ్రత...

డీప్ వీన్ థ్రాంబోసిస్‌లో రకరకాల లక్షణాలు కనిపిస్తాయి. అయితే ఆ లక్షణాలన్నీ అందరిలోనూ కనిపించకపోవచ్చు. దానికితోడు లక్షణాల తీవ్రతలో కూడా మార్పులుండవచ్చు. కొందరిలో రక్తపు గడ్డ చిన్నదిగా ఉంటే కొందరిలో అసలు ఎలాంటి లక్షణాలూ కనిపించకపోవచ్చు. సమస్య దానంతట అదే సమసిపోవచ్చు కూడా.

కొన్ని సాధారణ లక్షణాలు...

- రక్తం గడ్డ కట్టినచోట చర్మం వాపు (ముఖ్యంగా కాలు, పాదం వంటివి)
- చర్మం ఎర్రబారడం, అక్కడ వేడిగా ఉన్నట్లు అనిపించడం
- ఒక్కోసారి చర్మంలోంచి రక్తనాళాలు కనిపించడం
- కాలిలో డీవీటీ ఏర్పడినప్పుడు కాలు బలహీనంగా ఉన్నట్లు అనిపించడం
- రక్తనాళాలు గట్టి పడడం

ఈ లక్షణాలు అకస్మాత్తుగా కనిపించినా లేదా కాలం గడుస్తున్న కొద్దీ తీవ్రత పెరుగుతూ పోతున్నా వెంటనే డాక్టర్‌కు చూపించాలి. కొన్నిసార్లు రక్తనాళంలో ఏర్పడ్డ ఈ గడ్డ (క్లాట్) రక్తప్రవాహంలో కొట్టుకుపోతూ, గుండె రక్తనాళల్లోకి చేరి, గుండెస్పందనలను ఆపివేసే 'పల్మనరీ ఎంబాలిజమ్' అనే కండిషన్‌కు దారితీసే ప్రమాదం ఉంటుంది.

నివారణ...

- మంచి సమతులాహారం తీసుకోవడం అంటే పొట్టు తీయని కాయధాన్యాలు, ఆకుకూరలు, కాయగూరలు, తాజా పండ్లు తీసుకుంటూ బరువు పెరగకుండా చూసుకోవడం వంటి ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించడం
- క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. ముఖ్యంగా మహిళలు రోజుకు కనీసం 30 నిమిషాల వ్యాయామం చేయడం వల్ల రక్తప్రవాహం సాఫీగా మారి రక్తపు గడ్డలు ఏర్పడకుండా ఉంటుంది.
- తగినన్ని నీళ్లు, ద్రవాహారాలు తీసుకుంటూ ఎప్పుడూ హైడ్రేటెడ్‌గా ఉండటం.
- ఒకే చోట స్థిరంగా కూర్చుని ఉండకుండా కాసేపు నడక, స్ట్రెచ్చింగ్ వంటివి చేస్తూ ఉండటం.
- దూర ప్రయాణాలు చేస్తున్నప్పుడు అదేపనిగా వాహనంలో కూర్చుని ఉండకుండా తరచూ బ్రేక్ తీసుకోవటం.
- రక్తనాళాల్లో రక్తప్రవాహం సాఫీగా సాగేందుకు కంప్రెషన్ స్టాకింగ్ వంటివి వాడటం.
- గర్భం దాల్చిన మహిళల కుటుంబ సభ్యుల్లో డీప్ వీన్ థ్రాంబోసిస్ వచ్చిన ఆరోగ్య చరిత్ర ఉంటే ముందే డాక్టర్‌కు ఈ విషయాన్ని చెప్పడం మంచిది.

చికిత్స...

డీవీటీ వచ్చే అవకాశాలున్న వారు సపోర్ట్ స్టాకింగ్స్ / కంప్రెషన్ స్టాకింగ్స్ వాడటం.

రక్తాన్ని పలచబార్చే మందులైన యాంటీ కోయాగ్యులెంట్స్ వాడటం..

- క్లాట్ బస్టర్స్ / థ్రాంబోలైటిక్స్ చికిత్స : చిన్న పైప్ (క్యాథెటర్) ద్వారా రక్తం గడ్డకట్టిన చోటికి థ్రాంబోలైటిక్స్ అని పిలిచే మందును పంపి, రక్తపుగడ్డను చెదరగొట్టే ఔషధాల్ని వాడటం.



డాక్టర్ నరేంద్రనాథ్ మేడ,
కన్సల్టెంట్ వాస్క్యులార్ & ఎండో వాస్క్యులార్ సర్జన్

మెడి టిప్


చెవుల సంరక్షణ కోసం...!

చెవులను రక్షించుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలివి... ● పల్లెటూళ్లలో వేసవి సెలవులు రాగానే ఈత నేర్చుకోవడం కోసం పిల్లలు నీటి కుంటలు, చెరువులకు వెళ్తుంటారు. చెరువుల్లోని మురికి నీరు చెవుల్లోకి చేరి ఇన్ఫెక్షన్లు రావచ్చు. అందువల్ల ఈత నేర్చుకోవాలనుకునే పిల్లలు పరిశుభ్రమైన నీళ్లలోనే దిగాలి. ● చెవులను శుభ్రం చేయడానికి కొందరు గోరువెచ్చగా కాచిన కొబ్బరి నూనె, ఆముదం చెవుల్లో పోస్తారు. ఇలా ఎట్టిపరిస్థితుల్లోనూ చేయకూడదు. ● అపరిశుభ్రమైన నీటితో తయారు చేసే ఐస్‌క్రీముల వంటివాటితో గొంతుకు సంబంధించిన ఇన్ఫెక్షన్లు వస్తాయి. అవే ఇన్ఫెక్షన్లు చెవులకూ సోకే ప్రమాదం ఉంది. కాబట్టి చెవి, గొంతు, ముక్కు... భాగాల్లో ఎక్కడ ఇన్ఫెక్షన్ కనిపించినా నిర్లక్ష్యం చేయకూడదు. ముఖ్యంగా పిల్లల విషయంలో ఈ జాగ్రత్తను మరింతగా పాటించాలి.

పై జాగ్రత్తలు పాటించాక కూడా... గులివి, చీము వంటి సమమస్యలతో పాటు... చెవిపోటు ఎక్కువగా వస్తున్నా, సరిగా వినిపించకపోయినా... వీలైనంత త్వరగా ఈఎన్‌టీ వైద్యనిపుణులను సంప్రదించాలి.

గుండె పెరగడం అంటే..?

గుండె పెరిగే సమస్యను ఇంగ్లిష్‌లో హార్ట్ ఎన్‌లార్జ్‌మెంట్ అనీ, వైద్య పరిభాషలో కార్డియో మెగాలీ అని అంటారు. నిజానికి ఇదేమీ వ్యాధి కాదు. కొన్ని ఇతర ఆరోగ్య సమస్యలు (మెడికల్ కండిషన్ల) కారణంగా కనిపించే ఒక లక్షణం. గుండె ఎందుకు విస్తరిస్తుందో, అందుకు కారణమయ్యే ఆరోగ్య సమస్యలేమిటో, దీని నివారణ, చికిత్స ప్రక్రియలను తెలుసుకుందాం.



రక్తాన్ని సరఫరా చేసే ఓ పంప్ లాంటిది గుండె. ఈ పంపు బలహీనమైనప్పుడు శరీరానికి అవసరమైన రక్తాన్ని సరఫరా చేయలేదు. ఈ పరిస్థితినే హార్ట్ ఫెయిల్యూర్ అంటారు. గుండెపై ఒత్తిడి పెరిగినప్పుడు గుండె విస్తరిస్తుంది. కొందరిలో ఈ పరిస్థితి తాత్కాలికం కాగా... మరికొందరిలో ఎప్పటికీ మందులు వాడటం, చికిత్స కొనసాగించడం అవసరం కావచ్చు. ఈ సమస్య తీవ్రమైనదా కాదా అన్నది గుండె పెరగడానికి కారణమైన అంశాన్ని బట్టి ఉంటుంది.

గుండె పెరగడం... రకాలు...

గుండె కాస్త పెరిగినప్పటికీ... ఒక దశ వరకూ అది మామూలుగానే పనిచేస్తుంది. ఒక దశకు చేరాకే అనర్థాలు కనిపిస్తాయి. గుండె పెరిగిన కారణాలూ, తీరును బట్టి ఇందులో కొన్ని రకాలు ఉంటాయి. అవి...

- దయలేటెడ్ కార్డియోమయోపతి కారణంగా గుండె పెరిగితే ఇందులో గుండె కింది గదులు (వెంట్రికిల్స్) రెండూ పెరుగుతాయి.
- అధిక రక్తపోటు కారణంగా గుండె ఎడమవైపు కింది గది మందంగా మారవచ్చు. ఇలా కండరం మందంగా మారి గుండె పెరగడాన్ని 'హైపర్‌ట్రోఫిక్ కార్డియోమయోపతి' అంటారు.
- ఒక్కోసారి ఏ కారణమూ లేకుండానే గుండెపెరగవచ్చు లేదా ఇతమిత్థంగా కారణం తెలియకపోవచ్చు. ఈ పరిస్థితిని ఇడియోపథిక్ దయలేటెడ్ కార్డియో మయోపతి అంటారు.

కారణాలు...

- గుండె కండరానికి ఇన్ఫెక్షన్ (మయోకార్డైటిస్) వచ్చేలా చేసే వైరల్ ఇన్ఫెక్షన్లు.
- గుండెకు ఉండే నాలుగు కవాటాల్లో ఏదైనా దెబ్బ తినడం వల్ల కొన్ని గదుల్లోకి రక్తం ఎక్కువగా వెళ్తూ ఉండటం.
- గుండె చుట్టూరా ఉండే ఒక పొరలోకి ద్రవాలు చేరడం వల్ల ఇలా జరగడాన్ని పెరికార్డియల్ ఎఫ్యూజన్ అంటారు. దీన్ని ఎక్స్–రే ద్వారా కనుగొంటారు.
- రక్తహీనత వల్ల అన్ని అవయవాలకూ ఆక్సిజన్ తగినంతగా అందదు. అలా అందించే ప్రయత్నంలో గుండె మరింత ఎక్కువగా పని చేయాల్సి రావడంతో.
- మహిళల్లో గర్భధారణ సమయంలో గుండె పెరిగే కండిషన్ అయిన పెరిపార్టమ్ కార్డియోమయోపతి వల్ల.
- కార్డియాక్ అమైలాయిడోసిస్ అనే కండిషన్‌లో రక్తంలో అమైలాయిడ్ ప్రొటీన్ మోతాదులు పెరగడంతో (ఇందులో గుండె గోడలు మందంగా మారతాయి).
- దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధితో బాధపడేవారిలో
- థైరాయిడ్ గ్రంథి స్రావంలో అసమతుల్యతల వల్ల
- పల్మనరీ హైపర్‌టెన్షన్ అనే హైబీపీ ఉన్నవారిలో రక్తపోటు వల్ల గుండె మరింత ఎక్కువగా పనిచేయాల్సి రావడంతో గుండె కుడివైపు గదులు పెరగవచ్చు.
- మద్యం తాగేవారిలో లేదా మాదకద్రవ్యాలు తీసుకునేవారిలో దీర్ఘకాలంలో గుండె పెరిగే ప్రమాదం ఉంది.
- కొందరిలో జన్యు సమస్యల కారణంగా పుట్టుకతోనే గుండె, దాని విధుల్లో తేడాలు రావడంతో పాటు గుండె పెరగవచ్చు.

లక్షణాలు... ● శ్వాస సరిగా అందకపోవడం ● కాళ్ల / పాదాల వాపు ● బరువు పెరగడం (ముఖ్యంగా దేహం మధ్యభాగంలో... సెంట్రల్ ఒబేసిటీ) ● తీవ్రమైన అలసట ● కొందరిలో గుండెదడ లేదా గుండె లయ తప్పడం.

నిర్ధారణ పరీక్షలు: కొన్ని రక్తపరీక్షలు, ఛాతీ ఎక్స్–రే, సీటీ లేదా ఎమ్మారై స్కాన్, ట్రెడ్‌మిల్‌పై చేయించే స్ట్రెస్ పరీక్ష, అరుదుగా గుండె కండరాన్ని సేకరించి చేసే బయాప్సీ.

చికిత్స... గుండె పెరగడానికి కారణమైన అంశం ఆధారంగా చికిత్స చేస్తారు. ఉదాహరణకు... ● గుండెకు రక్తాన్ని చేరవేసే రక్తనాళాల్లో అడ్డంకి ఏర్పడటం వల్ల వచ్చే కరోనరీ ఆర్టరీ డిసీజ్‌లో ఆ అడ్డంకి తొలగింపు ద్వారా. ● రక్తపోటును నియంత్రించే మందుల్ని వాడటం ద్వారా. ● గుండె కవాటాలలో లోపాల వల్ల గుండె పెరిగితే వాల్వ్‌లకు తగిన రిపేరు చేయడం లేదా శస్త్రచికిత్స ద్వారా. ● మద్యపానం లేదా మాదక ద్రవ్యాల వల్ల గుండె పెరిగితే ఆ అలవాటును మాన్పించడం ద్వారా.

ఇతర మందుల వాడకంతోనూ... కాళ్లవాపులు అధికంగా ఉన్నప్పుడు అధికంగా మూత్రం వచ్చేలా చేసే డై–యూరెటిక్స్‌తో ● రక్తపోటు పెరిగినప్పుడు యాంజియోటెన్సిన్ – కన్వర్టింగ్ ఎంజైమ్ ఇన్హిబిటార్స్, బీటా బ్లాకర్స్ వంటి మందులతో. ● రక్తాన్ని పలచబార్చే యాంటీ కోయాగ్యులెంట్స్‌తో. ● గుండె లయ తప్పినప్పుడు యాంటీ అరిథ్మియా డ్రగ్ అనే మందును వాడతారు. ● గుండె కొట్టుకోవడం ఆగితే ఇంప్లాంటబుల్ కార్డియోవెర్టర్ డీ ఫిబ్రిలేటర్‌తో తిరిగి గుండె కొట్టుకునేలా చేస్తారు. ● గుండె స్పందనల వేగం పెరిగినా లేదా తగ్గినా క్రమబద్ధం చేసే 'పేస్‌మేకర్' అమర్చడం ద్వారా. ● లెఫ్ట్ వెంట్రిక్యులార్ అసిస్ట్ డివైస్ (ఎల్‌వీఏడీ) అనే ఉపకరణాన్ని.. గుండెమార్పిడి శస్త్రచికిత్స అవసరమైన వారు తమకు సరిపడే గుండెకోసం వేచి చూస్తున్నప్పుడు... ● గుండెకు రక్తాన్ని చేరవేసే రక్తనాళాల్లో అడ్డంకులు (బ్లాక్స్) చాలా ఎక్కువగా ఉన్నప్పుడు బైపాస్ శస్త్రచికిత్సతో... ● చివరి ప్రత్యామ్నాయంగా గుండె మార్పిడి (హార్ట్ ట్రాన్స్‌ప్లాంటేషన్) చికిత్సతో పరిస్థితిని చక్కదిద్దుతారు.



డా. కరుణాకర్ రాపోలు
ఇంటర్‌వెన్షనల్ కార్డియాలజిస్ట్